ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ సంపుటి : 18 సంచిక : 295 శనివారం, జూన్ 21, 2025 పేజీలు:4 వెల: 1 రూ/

Published from Hyderabad, Medak Nalgonda, Karimnagar, Warangal, Khammam

# ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించా

## - నరేంద్ర మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ** అమెరికా పర్యటనకు రావాలంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి వచ్చిన ఆహ్వానాన్ని తాను సున్నితంగా తిరస్కరించానని, ఒడిశా పర్యటనకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఒడిశాలో పర్యటించిన ఆయన, జగన్నాథుని భూమికి రావడం తనకెంతో ముఖ్యమని పేర్కొన్నారు. అంతకుముందు బీహార్‌లో ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న మోదీ, మధ్యాహ్నం ఒడిశా చేరుకుని రోడ్ షో, బహిరంగ సభలో పాల్గొన్నారు. జీ7 సదస్సు కోసం కెనడా వెళ్లినప్పుడు ట్రంప్ ఫోన్ చేసి, వాషింగ్టన్ మీదుగా వెళ్లాలని సూచించారని, విందులో పాల్గొని చర్చించుకుందామని చెప్పారని అన్నారు. "జగన్నాథుని క్షేత్రానికి వచ్చేందుకు, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆహ్వానాన్ని నేను వినమ్రంగా తిరస్కరించాను" అని మోదీ బహిరంగ సభలో వెల్లడించారు. ఒడిశాలో బీజేపీ ప్రభుత్వ తొలి ఏడాది పాలనను ప్రధాని ఈ సందర్భంగా ప్రశంసించారు. "ఒడిశాలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చింది. పూరీ జగన్నాథ ఆలయానికి చెందిన నాలుగు ద్వారాలను, రత్న భండార్‌ను తిరిగి తెరిపించింది" అని ఆయన అన్నారు. ఈ పర్యటనలో భాగంగా, ప్రధాని మోదీ రూ. 18,600 కోట్లకు పైగా విలువైన 105 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. ఒడిశా విజన్ డాక్యుమెంట్ ను ఆవిష్కరించడంతో పాటు, పలు కొత్త రైళ్లను కూడా జెండా ఊపి ప్రారంభించారు. అంతేకాకుండా, 'లక్షపతి దీదీలు' సహా పలువురు లబ్ధిదారులను సత్కరించారు. తాగునీరు, నీటిపారుదల, ఆరోగ్య మౌలిక సదుపాయాలు, గ్రామీణ రహదారులు, వంతెనలు, జాతీయ రహదారులు, రైల్వే మౌలిక సదుపాయాలకు సంబంధించిన ప్రాజెక్టులు వీటిలో ఉన్నాయి. గతేడాది జూన్ ఒడిశాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రధాని మోదీ రాష్ట్రానికి రావడం ఇది ఆరోసారి.

### హైదరాబాద్ మార్కెట్‌పై
# కన్నేసిన సింగరేణి

## - చిన్నపరిశ్రమలే టార్గెట్‌గా సరికొత్త వ్యూహం

**హైదరాబాద్** తెలంగాణలో చిన్న పరిశ్రమలే టార్గెట్ గా సింగరేణి యాజమాన్యం వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టింది. సింగరేణిలో ఏటా 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. తెలంణలోని ధర్మల్ విద్యుత్ కేంద్రంతోపాటు ఇతర రాష్ట్రాలకు సింగరేణి నుంచి ఏటా బొగ్గు సరఫరా జరుగుతోంది. హైదరాబాద్ మహానగరంగా విస్తరించి, అభివృద్ధిలో వేగంగా దూసుకుపోతున్నతరుణంలో, నగరం చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో చిన్న తరహా పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. ఈ పరిశ్రమల నిర్వహణకు అవసరమైన

2లో..

### ఫోన్ ట్యాపింగ్ సర్వైలెన్స్‌లోకి
# బండి సంజయ్

## - సాక్ష్యం చెప్పాలని బీజేపీ నేతకు పిలుపు

**హైదరాబాద్** తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరింత విస్తరిస్తోంది. ఇది ఒకరిద్దరికే పరిమితం కాకుండా తెలుగు రాష్ట్రాల్లో కీలక నేతలంతా ఈ సర్వైలెన్స్‌లోకి వచ్చేశారా అనే అనుమానం కలుగుతోంది. కేంద్రమంత్రి బండి సంజయ్ సన్నిహితులు, సిబ్బంది ఫోన్లు ట్యాప్ అయినట్టు అధికారులు గుర్తించారట. ఇప్పుడు ఆ దిశగా దర్యాప్తు టర్న్ అవుతున్నట్టు తెలుస్తోంది. కేంద్రమంత్రి బండి సంజయ్‌కు సంబంధించిన వారి ఫోన్లు ట్యాప్ అయ్యాయాలేదా అనే విషయాన్ని గుర్తించేందుకు కరీంనగర్ బీజేపీ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావును సిట్ అధికారులు పిలిచారు. గతంలో జరిగిన ఘటనలు వివరించాలని ఆదేశించారు. ఇప్పుడు ఆయన చెప్పే సాక్ష్యం ఆధారంగా దర్యాప్తును ముందుకు తీసుకెళ్లనున్నారు. బండి సంజయ్‌కు ప్రవీణ్‌రావు చాలా సన్నిహితుడు. టెన్త్‌పేపర్ లీక్, బైంసా అల్లర్లు, ఇతర కార్యక్రమాల్లో బండి సంజయ్‌తోపాటు ప్రవీణ్‌రావు పాల్గొన్నారు. ఎప్పుడూ వెన్నంటి ఉండే ప్రవీణ్‌రావు ఫోన్‌ను అప్పట్లో ట్యాప్ చేసినట్టు అధికారులు తేల్చారు. ఇప్పుడు వాటిపై నిగ్గు తేల్చే పనిలో ఉన్నారు. అందుకే ఆయనకు నోటీసులు పంపించి విచారణకు పిలుస్తున్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కొందరు కాంగ్రెస్ నాయకులు సిట్ ముందు హాజరై తమ ఫోన్‌లు ట్యాప్ అయినట్టు వాంగ్మూలం ఇస్తున్నారు. అందుకు సాక్ష్యాలను కూడా సిట్ అధికారులు అందజేస్తున్నారు. ఇప్పటికే పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ హాజరై సిట్‌కు స్టేట్మెంట్ ఇచ్చారు. ఇప్పుడు చెన్నూరు నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ లీడర్లు సిట్ విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లో

2లో..



## నాయిని, కడియం శ్రీహరిపై కొండా సురేఖ తీవ్ర వ్యాఖ్యలు

- భద్రకాళి ఆలయం ఎవరి జాగీరూ కాదన్న మంత్రి
- కడియం శ్రీహరి తన పదవికి ఎసరు పెడుతున్నారని సురేఖ ఆరోపణ
- గోదావరి పుష్కరాలకు కేంద్రం రూ.200 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి
- కేంద్ర మంత్రులు చొరవ చూపకపోతే చరిత్రహీనులవుతారని సురేఖ వ్యాఖ్య



**హైదరాబాద్** రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం విలేకరులతో జరిపిన సమావేశంలో ఆమె పలు అంశాలపై ఘాటుగా స్పందించారు. భద్రకాళి ఆలయ వివాదం నుంచి మొదలుకొని, తన మంత్రి పదవిని లక్ష్యంగా చేసుకుని కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అదే సమయంలో గోదావరి పుష్కరాల నిధులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై, తెలంగాణ కేంద్ర మంత్రులపైనా ఆమె విమర్శలు గుప్పించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తీరుపై కొండా సురేఖ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "భద్రకాళి ఆలయం ఎవరి సొంత ఆస్తి కాదు. కానీ కొందరు అది తమదే అన్నట్లుగా భావిస్తున్నారు" అంటూ నాయినిని ఉద్దేశించి విమర్శించారు. అభివృద్ధి కార్యక్రమాలకు నాయిని రాజేందర్ రెడ్డి అడ్డుపడుతున్నారని ఆమె ఆరోపించారు. భద్రకాళి అమ్మవారికి ఆగమశాస్త్ర నియమాల ప్రకారమే బోనం సమర్పించాలని నిర్ణయించామని, అయితే అక్కడ జంతుబలులు ఇస్తారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి మండిపడ్డారు. "అమ్మవారు శాకాహారి అనే విషయం అందరికీ తెలుసు. ఏళ్లుగా అక్కడ పనిచేస్తున్న అర్చకుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకున్నాం. బల్కంపేట దేవాలయం నుంచి బోనం తీసుకొచ్చి భద్రకాళి అమ్మవారికి సమర్పిస్తాం" అని సురేఖ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై కూడా మంత్రి సురేఖ తీవ్ర ఆరోపణలు చేశారు. కడియం శ్రీహరిని ఉద్దేశించి మాట్లాడుతూ, తాను మంత్రిగా ఉండటం చూసి కడియం నామోషీగా భావిస్తున్నారని అన్నారు. "అందుకే నా మంత్రి పదవి పోతుందని ఆయన తప్పుడు ప్రచారం చేయిస్తున్నారు.

2లో..

# చంద్రబాబుతో చర్చలకు సిద్ధం

## - కానీ ఆ హక్కులు వదులుకునే ప్రసక్తి లేదన్న సీఎం

- పీఎఫ్‌ఆర్ ఇచ్చే ముందు తెలంగాణను సంప్రదించకపోవడమే వివాదానికి కారణమని వెల్లడి
- ఈ నెల 23న కేబినెట్ సమావేశం అనంతరం ఏపీని చర్చలకు ఆహ్వానిస్తామన్న సీఎం
- రాష్ట్రాల మధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయని స్పష్టీకరణ

**న్యూఢిల్లీ / హైదరాబాద్** గోదావరి - బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చలు జరిపేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎవరితోనూ వివాదాలు కోరుకోవడం లేదని, అయితే తెలంగాణ హక్కులను మాత్రం వదులుకునే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన రేవంత్ రెడ్డి, పలు కీలక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. బనకచర్ల ప్రాజెక్టు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తొలుత తెలంగాణను సంప్రదించకుండా నేరుగా కేంద్ర ప్రభుత్వానికి ప్రాథమిక సాధ్యసాధ్యాల నివేదిక (పీఎఫ్ఆర్) సమర్పించడమే

2లో..



## పోలవరంపై కవిత సంచలన వ్యాఖ్యలు

- న్యాయపోరాటం చేస్తామని వెల్లడి
- పోలవరం ప్రాజెక్టు నిర్వహణను ఉమ్మడి ఏపీలోనే వ్యతిరేకించామన్న కవిత
- తెలంగాణకు చెందిన 7 మండలాలను ఏపీకి అన్యాయంగా అప్పగించారని ఆరోపణ
- పోలవరం సామర్థ్యం పెంచడంతో ముంపు పెరుగుతోందని ఆందోళన
- -ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణకు వెనక్కి ఇవ్వాలని డిమాండ్
- జూన్ 25న ప్రధాని సమావేశంలో ఈ విషయం ప్రకటించాలని విజ్ఞప్తి

**హైదరాబాద్** పోలవరం ప్రాజెక్టు వల్ల తెలంగాణ చాలా సమస్యలు ఎదుర్కొంటుందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. ఈ అంశంపై నిర్వహించిన తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఆమె కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన గ్రామాల్లో ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. పురుషోత్తపట్నం, గుండాల, ఎట్టపాక, కన్నాయగూడెం, పిచ్చుకలపాక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ నెల 25న ప్రగతి ఎజెండా పేరిట ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సీఎంలతో నిర్వహించే సమావేశంలో ప్రధాని మోదీ



2లో..

# ఎస్బిఐ మెగా రక్త దాన శిబిరం






**మెదక్ జూన్ 20 (ప్రజా స్వరం)** స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 70 వ వార్షికోత్సవం సందర్భంగా సిద్దిపేట రీజియన్ ఆఫీస్ వారి ఆధ్వర్యంలో మెదక్ పట్టణంలోని స్థానిక జీకేఆర్ గార్డెన్స్ లో మెగా రక్త దాన శిబిరం నిర్వహించడం జరిగింది. ఎస్బిఐ అవిర్భావించి 1జులై 2025 నాటికి 70 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా ప్రతీ రీజియన్ లో ఈ మెగా రక్త దాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం లో 83 మంది ఎస్బిఐ సిబ్బంది, వాలంటీర్లు కలిసి ప్రభుత్వ బ్లడ్ బ్యాంక్ కి బ్లడ్ డొనేట్ చేశారు. ఈ కార్యక్రమం లో బ్యాంక్ డాక్టర్ సునీల్ చౌదర,ఆఫీసర్స్ అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ నర్రా సంతోష్, స్టాఫ్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ యూ. బాలమురళి కృష్ణ,డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి. రాంబాబు, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ వి. రామకృష్ణ, రీజినల్ సెక్రటరీ వి నరసింహ చారి, ఎస్బిఐ చీఫ్ మేనేజర్ ఎం.రామ కిషోర్, మేనేజర్ ఎం. రవి తదితర సిబ్బంది పాల్గొన్నారు.




## ఓఆర్ఆర్ టోల్ లీజు పై ఏసీబీ కి పిర్యాదు

**– బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**

**హైదరాబాద్** ఓఆర్ఆర్ టోల్ లీజు విషయంలో జరిగిన అవినీతి పై బీసీ పోలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ శుక్రవారం ఏసీబీ డీజీకి పిర్యాదు చేసారు. తరువాత మీడియాతో రాచాల యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ ఓఆర్ఆర్ టోల్ లీజు అక్రమాలపై ఏసీబీ డీజీ నీ కలిసి ఫిర్యాదు చేసాం. గతంలో ఓసారి ఓఆర్ఆర్ టోల్ లీజు అక్రమాలపై ఫిర్యాదు చేశామని అన్నారు. ఫిర్యాదు చేసినప్పటికీ పురోగతి లేకపోవడంతో, మరోసారి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం నుండి అనుమతి వచ్చాక విచారణ చేపడతామని డీజీ తెలిపారు. ఓఆర్ఆర్ టోల్ ప్లాజా లీజు అంశంలో 7380 కోట్లు అవినీతి జరిగింది. అవినీతి జరిగింది అనడానికి పక్కా సాక్షాలు ఉన్నాయి.. ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఓఆర్ఆర్ టోల్ లీజు అంశంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.ఇప్పుడు సీఎం ఎందుకు మౌనంగా ఉన్నారు. అవినీతి జరిగిన చర్యలు తీసుకోకపోవడంతో ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుంది. ఓవర్ ఆర్ టోల్ లీజు అంశం లో కేటీఆర్ కు అనధికారికంగా 1000 కోట్లు ముడుపులు అందాయి. అధికారికంగా 54 కోట్ల రూపాయల ముడుపులు కేటీఆర్కు అందాయి. ఓఆర్ఆర్ టోల్ లీజులో విషయంలో క్విడ్ ప్రోకో జరిగింది. ప్రభుత్వం విచారణ జరిపి కేసీఆర్ను కేటీఆర్ ను అరెస్టు చేయాలని అన్నారు.

## వేతన సవరణ (ఖఖీఅ) జీవోలో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలను కూడా చేర్చాలి

- ఉద్యోగులకు హెల్త్ కార్డులు తక్షణమే ఇవ్వాలి
- వేములవాడ ,భద్రాచలం ,బాసర ,కొండగట్టు, కొమురవెల్లి ,యాదగిరిగుట్ట ఉద్యోగుల భేటీ
- సమస్యలను దేవాదాయ శాఖ మంత్రికి నివేదిస్తామని జేఏసీ చైర్మన్ గజవెల్లి రమేష్ బాబు వెల్లడి
- పలు కీలక అంశాలపై చర్చ, తీర్మానాలు

**యాదగిరిగుట్ట :** రాబోవు వేతన సవరణ (ఖఖీఅ) జీవోలో రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాలను కూడా చేర్చాలని, ఉద్యోగులకు హెల్త్ కార్డులు తక్షణమే ఇవ్వాలని యాదగిరిగుట్టలో జరిగిన ప్రధాన రాష్ట్ర దేవాలయాల కీలక సమావేశం ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. రాష్ట్ర ప్రధాన దేవాలయాల ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గజవెల్లి రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర సమావేశంలో వేములవాడ , భద్రాచలం, బాసర కొండగట్టు, కొమురవెల్లి, యాదగిరిగుట్ట దేవస్థానంలో పనిచేస్తున్న ఉద్యోగస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై సమావేశంలో కూలంకషంగా చర్చించి తీర్మానించారు. సమావేశ తీర్మానాలను ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని ముఖ్య అతిథిగా పాల్గొన్న టీఎన్జీవోల సెంట్రల్ యూనియన్ అధ్యక్షులు మారం జగదీష్ సభ హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. పెండింగ్ లో ఉన్న హెల్త్ కార్డులు వెంటనే జారీ చేయాలని సమావేశం కోరింది. జీవో 888 ను దేవాలయంలో ఉన్న పోస్టులకు అనుగుణంగా పూర్తిస్థాయిలో సవరణ చేయాలని, అదేవిధంగా ఉద్యోగులకు అనుగుణంగా జీవో 261తగు సవరణ చేయాలని కూడా కోరింది. పదవీ విరమణకు దగ్గరలో ఉన్న ఉద్యోగులను, అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఉద్యోగులను మానవతా దృక్పథంతో వారి వారి మాతృ సంస్థలకు బదిలీ చేయాలని, లేదా డిప్యూటేషన్ పై పంపించాలని కూడా సమావేశం తీర్మానించింది. పని భారం తగ్గించేందుకు వీలుగా అవసరమైన మేరకు క్యాడర్ స్ట్రెంతు అనుమతించాలని, అదేవిధంగా ఖాళీగా ఉన్న పోస్టులను రెగ్యులర్ పద్ధతిన నియామకాలు చేయాలని డిమాండ్ చేసింది. సిపిఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని కోరింది. సమావేశ నిర్ణయాలను త్వరలోనే రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ను కలిసి విన్నవిస్తామని గజవెల్లి రమేష్ బాబు మీడియాకు తెలిపారు. ఈ సమావేశంలో మారం జగదీష్ తో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్, టిఎన్జీవోల రాష్ట్ర కార్యవర్గము, యాదాద్రి భువనగిరి జిల్లా టీఎన్జీవోల అధ్యక్షుడు మందడి ఉపేందర్ రెడ్డి సహా వేములవాడ అధ్యక్షుడు కూరగాయల శ్రీను, భద్రాచలం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి , బాసర నుంచి సుదర్శన్ గౌడ్, కొండగట్టునుండి చందు , కొమరవెల్లి నుండి అధ్యక్షుడు మల్లికార్జున శర్మ అదే విధంగా యాదగిరిగుట్ట దేవస్థానం నుండి జె కృష్ణ, దయానందు పాల్గొన్నారు.

## జీవన విధానంలో యోగా భాగం కావాలి

**ఒంగోలు** యోగా మనందరి జీవన విధానంలో భాగం కావాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలతో యోగా సాధన కార్యక్రమాన్ని ఒంగోలులోని మినీ స్టేడియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 5వేల మంది స్వయం సహాయ సంఘాల మహిళలు భాగస్వాములయ్యారు. పొదుపు మహిళలతో యోగా గురువు బాలసుబ్రహ్మణ్యం యోగసాధన చేయించారు.

పొదుపు సంఘాల మహిళలతో రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ఒంగోలులో నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో 11లక్షల మంది యోగా సాధన కోసం నమోదు చేసుకున్నారని తెలిపారు. రేపు నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 6వేలకు పైగా ప్రదేశాలలో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

## కాంగ్రెస్ ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి మరోసారి నిరసన సెగ

**వరంగల్** పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని కి మరోసారి నిరసన సెగ తగిలింది. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా, ప్రజలు తరిమి కొడుతుండడంతో తీవ్ర ఆందోళనలో అత్తా, కోడళ్లు వున్నారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలో పర్యటిస్తుండగా, యశస్విని రెడ్డిని ప్రజలు అడ్డుకొని నిలదీసారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు విషయంలో అవకతవకలు జరుగుతున్నాయని, ఇల్లు ఉన్నవారికే మళ్ళీ ఇల్లు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రజల ఆగ్రహం చూసి యశస్విని రెడ్డి స్పందించకుండా వెళ్లిపోయారు.

## వెలగాడ గ్రామంలో కప్ప తల్లి ఆటలు

**శ్రీకాకుళం** ఏపీలో వర్షాలే పడటం లేదు. ఏపీలో వర్షాల కోసం గ్రామస్థులు కప్ప తల్లి ఆటలు ఆడుతున్నారు. రోకలికి కప్పని కట్టి ఊరేగింపులు చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా జి. సిగడాం మండలం వెలగాడ గ్రామంలో వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని వేడుకుంటూ కప్ప తల్లి ఆటలు ఆడారు గ్రామస్థులు.

రోకలి బండకు కొత్త గుడ్డలో ఒక కప్పను కట్టి, దానిని రోకలిబండ మధ్యలో వేలాడదీసి, ఆ కప్పను పసుపు, కుంకుమలతో అలంకరించి ఊరేగించారు గ్రామస్థులు. ఇండ్ల వద్దకు వచ్చిన కప్ప తల్లికి బిందెలతో నీళ్లు పోస్తూ వరుణుడు కరుణించాలని వేడుకున్నారు మహిళలు. కరువు సంభవించినప్పుడు గ్రామదేవతను పూజించి కప్ప తల్లి ఆడితే సకాలంలో వర్షాలు కురుస్తాయని, ఇది తరతరాలుగా వస్తున్న సంప్రదాయమని తెలిపారు గ్రామస్థులు.

### ఈ నెల 23 ల ధర్నా చౌక్ దగ్గర

## తెలంగాణ లోక్ దళ్ పార్టీ దీక్ష

**హైదరాబాద్** రాష్ట్రంలో విద్య, ఉపాధి వ్యవసాయ రంగాలపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈనెల 23న తెలంగాణ లోక్ దళ్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద దీక్ష నిర్వహించనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు కపిలవాయి దిలీప్ కుమార్ తెలిపారు. పేద దిగువ మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2009లో ఉచిత విద్య హక్కు చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని ఆయన గుర్తు చేశారు. ఈ చట్టం ప్రకారం దేశంలోని ప్రతి ప్రైవేట్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు 25శాతం సీట్లను ఉచితంగా కేటాయించి వారికి అయ్యే ఫీజును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులకు సివిల్ స్కోర్ క్రైటీరియాని తొలగించాలని డిమాండ్ చేశారు. పేదవారికి సిబిల్ స్కోర్ ఎలా ఉంటుందని ప్రశ్నించారు. తెలంగాణ గవర్నమెంట్ పర్సంటేజ్ గవర్నమెంట్ లాగా మారిందని మంత్రులే బహిరంగంగా చెప్పడం దారుణం అన్నారు. కాంట్రాక్టర్లు సెక్రటేరియట్ ముందు పోయి మంత్రులు 30శాతం కమిషన్ అడుగుతున్నారని ధర్నా చేయడం దారుణమన్నారు. రాజ్యాంగబద్ధంగా గవర్నర్ ముందు ప్రమాణం చేసిన మంత్రులు అవినీతికి పాల్పడడం చాలా షోచనీయమన్నారు. అవినీతికి పాల్పడిన మంత్రులను తక్షణమే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ లో ఉన్న ఎమ్మెల్యేలు తెలంగాణ ఉద్యమంలో కష్టపడ్డ వారు ఉన్నారని వారిని మంత్రి పదవిలోకి తీసుకోవాలని సూచించారు.

## చంద్రబాబుతో చర్చలకు సిద్ధం

ప్రస్తుత వివాదానికి మూలకారణమని రేవంత్ రెడ్డి అన్నారు.“పీఎఫ్ఆర్ ఇచ్చే ముందే మాతో చర్చించి ఉంటే ఈ వివాదం ఉండేది కాదు. కేంద్రానికి ఏపీ నివేదిక ఇవ్వగానే, కేంద్రం కూడా అన్ని రకాల చర్యలకు సిద్ధమవుతోంది” అని ఆయన వివరించారు. ఈ అంశంపై చర్చించేందుకు తమకు ఎలాంటి బేషజాలు లేవని, ఇద్దరు ముఖ్యమంత్రులు కూర్చుని ప్రాజెక్టుల వారీగా సమస్యలపై మాట్లాడుకుందామని ఆయన సూచించారు. “ఒక రోజు కాదు, అవసరమైతే నాలుగు రోజులైనా చర్చిద్దాం. రాష్ట్రాల మధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయి. న్యాయ, సాంకేతిక అంశాలను పరిశీలిద్దాం” అని రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ నెల 23న తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుందని, ఈ భేటీలో బనకచర్ల అంశంపై సమగ్రంగా చర్చించిన తర్వాత, ఆంధ్రప్రదేశ్ను అధికారికంగా చర్చలకు ఆహ్వానిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు. “ఒక అడుగు ముందుకేసి మేమే ఏపీని చర్చలకు పిలుస్తాం. తెలుగువారి మధ్య అనవసరమైన సమస్యలు ఉండొద్దు. పైన, కింద ఉన్న రాష్ట్రాలతో వివాదం కోరుకోవట్లేదు” అని ఆయన అన్నారు. విభజన చట్టంలోని అంశాలను పరిష్కరించుకునేందుకు ఇప్పటికే అధికారులు, మంత్రుల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తెలంగాణ హక్కులను ఆంధ్రప్రదేశ్కు ధారాదత్తం చేసిందని ఆరోపించారు. “నీళ్లు, నిధుల పేరిట బీఆర్ఎస్ నేతలు మోసపూరిత సెంటిమెంట్ను అడ్డుపెట్టుకున్నారు. రాయలసీమను రత్నాలసీమ చేస్తానని కేసీఆర్ అన్నారు. గోదావరి జలాలను ఏపీ ఉపయోగించుకుంటే తప్పేంటని కూడా గతంలో వ్యాఖ్యానించారు. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణ హక్కులను ఏపీకి రాసిచ్చింది కేసీఆర్, హరీశ్ రావులే” అని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తాను కృష్ణా జలాల్లో 500 టీఎంసీలకు బ్లాంకెట్ ఎన్ఓసీ అడిగితే మాజీ మంత్రి హరీశ్ రావు తప్పుపడుతున్నారని, ఆయన వాదనలో పసలేదని అన్నారు. 2023లో కేంద్రానికి హరీశ్ రావు రాసిన లేఖలో కేవలం 405 టీఎంసీలు మాత్రమే తెలంగాణకు అడిగారని గుర్తుచేశారు.“విభజన చట్టంలో పోలవరానికి మాత్రమే అనుమతి ఉంది. బనకచర్ల అనేది పోలవరానికి అనుబంధ ప్రాజెక్టు. దీనిపై తెలంగాణ అభిప్రాయం తప్పక తీసుకోవాల్సిందే. గోదావరిలో 968 టీఎంసీలు వాడుకునే వెసులుబాటు తెలంగాణకు ఉంది. కానీ, కేటాయించిన నీటిని వాడుకునేందుకు అవకాశం ఇవ్వకపోవడంతోనే వివాదాలు తలెత్తుతున్నాయి” అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కోర్టుకు వెళ్లడం కంటే ముందుగా చర్చించుకోవడమే ఉత్తమమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వివాద పరిష్కారానికి ఎలాంటి కాలపరిమితి లేదని స్పష్టం చేశారు. జూలై 6, 7 తేదీల్లో మరోసారి ఢిల్లీలో పర్యటించనున్నట్లు ఆయన తెలిపారు. అధికారం కోల్పోయిన అసహనంతోనే హరీశ్ రావు విమర్శలు చేస్తున్నారని, తెలంగాణకు అన్యాయం చేసింది కేసీఆర్, హరీశ్ రావులేనని పునరుద్ఘాటించారు. కేటీఆర్కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లైజనింగ్ అధికారిగా పని చేస్తున్నారని, కేసీఆర్కు కాళేశ్వరం ఏటీఎంలా మారిందని ప్రధాని మోదీ, అమిత్ షా గతంలో అన్నారని గుర్తుచేశారు. దీనిపై కిషన్రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## మొదటి పేజీ తరువాయి

## హైదరాబాద్ మార్కెట్పై కన్నేసిన సింగరేణి

బొగ్గు కోసం ఇన్నాళ్లు రామగుండం లేదా కొత్తగూడెం వెళ్లాల్సి వస్తోంది. తక్కువ మొత్తంలో బొగ్గు అవసరమైనప్పటికీ , దూరప్రాంతం నుంచి సరఫరా చేసుకోవడంతో రవాణా ఖర్చులు వినియోగదారులకు భారంగా మారుతున్నాయి. ఈ ప్రభావం బొగ్గు విక్రయాలపై పడటంతో ఆశించిన స్థాయిలో సింగరేణిలో బొగ్గు విక్రయాలు జరగడంలేదు. దీనిపై దృష్టి సారించిన సింగరేణి యాజమాన్యం హైదరాబాద్ బహిరంగ మార్కెట్ పై కన్నేసింది. బొగ్గు ఎగుమతులు భారీగా పెంచేందుకు భాగ్యనగరాన్ని టార్గెట్ చేసింది. అతి త్వరలో హైదరాబాద్లో సింగరేణి బొగ్గు విక్రయ కేంద్రం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది.తెలంగాణ రాజధానిలో విక్రయ కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా బొగ్గు అవసరాలకు ఇకపై హైదరాబాద్ చుట్టుప్రక్కల పరిశ్రమల నిర్వాహకులు రామగుండం, కొత్తగూడెం వెళ్లాల్సిన పనిలేదు. రవాణాఖర్చుల భారం భారీగా తగ్గుతాయి. హైదరాబాద్ విక్రయ కేంద్రంలోనే బొగ్గు అందుబాటులోకి రావడంతో విక్రయాలు ఊహించని స్థాయిలో పెరుగుతాయి. ప్రస్తుతం రోడ్డు మార్గం ద్వారా బొగ్గు తరలించేదుకు టన్నుకు 1600 రూపాయలు ఖర్చవుతుంది. రైలు మార్గం ద్వారా తరలించేందుకు టన్నును 500 రూపాయలు అవుతుంది.భారీ మొత్తంలో బొగ్గును హైదరాబాద్ విక్రయ కేంద్రానికి తరలించి, అక్కడ నుంచి నేరుగా అమ్మకాలు జరపడం ద్వారా డిమాండ్ పెరగడంతోపాటు సరఫరా సులభతరం అవుతుంది. హైదరాబాద్ చుట్టు ప్రక్కల పరిశ్రమలతోపాటు సమీపంలోని జిల్లాల నుంచి హైదరాబాద్కు రవాణా సదుపాయం ఎనీటైమ్ అందుబాటులో ఉంటుంది కాబట్టి విక్రయాలు ఊహించని ఊపందుకుంటాయి. ఇలా సింగరేణి చరిత్రలో గతంలో ఎన్నడూ లేనట్లుగా బహిరంగా మార్కెట్లో సింగరేణి బొగ్గు విక్రయాలు ప్రారంభించడం ద్వారా సింగరేణి సంస్థకు లాభాల పంట ఖాయమని యాజమాన్యం భావిస్తోంది. హైదరాబాద్ కేంద్రంగా విస్తరించిన వ్యాపారం ద్వారా వచ్చే లాభాల వల్ల సింగరేణి కార్మికులకు మేలు జరుగుతుందని, ఆర్థికంగా కార్మికులు బలోపేతం అయ్యేందుకు ఇది మంచి అవకాశం కావడంతో కార్మికుల నుంచి సైతం హర్షం వ్యక్తమవుతోంది.హైదరాబాద్ కేంద్రంగా బహిరంగ మార్కెట్లో బొగ్గు విక్రయం నిర్ణయం సరైనదే అయినప్పటికీ నాణ్యత విషయంలో జాగ్రత్తలు పాటించాలిని భావించింది సింగరేణి యాజమాన్యం. ఈ నేపథ్యంలో నాణ్యత తక్కువగా ఉండే జీ 14, జీ 15 బొగ్గు సరఫరా నిలిపివేయాలనే నిర్ణయం తీసుకున్నారు. క్వాలిటీ బొగ్గు జీ 13ను మాత్రమే బహిరంగ మార్కెట్ లోకి సరఫరా చేయాలని భావించారు. ఇలా టార్గెట్ హైదరాబాద్ ద్వారా ఊహించని స్థాయిలో బొగ్గు విక్రయాలు పెరుగుతాయని సింగరేణి సంస్థ పూర్తి నమ్మకంతో ఉంది. సాధ్యమైనంత వేగంగా తెలంగాణ రాజధానిలో విక్రయ కేంద్రం ఏర్పాటు, బొగ్గు అమ్మకాలను ప్రారంభించడం ద్వారా బహిరంగ మార్కెట్ సింగరేణి సత్తా చాటేందుకు సిద్దమవుతోంది.

## ఫోన్ ట్యాపింగ్ సర్వైలెన్స్లోకి బండి సంజయ్

ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణకు రామకృష్ణాపూర్ కాంగ్రెస్ నాయకుడు, తవక్కల్ విద్య సంస్థల అధినేత అబ్దుల్ అజీజ్, మందమర్రి కాంగ్రెస్ నాయకుడు ఎండీ ముజాహిద్ హాజరయ్యారు. గత ప్రభుత్వం హయాంలో చాలా ఇబ్బంది పడ్డట్టు చెప్పారు. బాల్క సుమన్ లాంటి వారు హింసించారని ఆరోపించారు. వివేక్కు మద్దతుగా ఉన్నందుకు ఫోన్లు ట్యాప్ చేసి బెదిరింపులకు పాల్పడినట్టు వివరించారు. పోలీసులు, కీలక నేతలు భయపెట్టారని అన్నారు. తమ ఫోన్ ట్యాప్ అయిన సంగతి సిట్ అధికారులు చెప్పే వరకు తెలియదని తర్వాత నాటి సంగతులు గుర్తుకు వచ్చాయని అన్నారు. దాదాపు ఆరు నెలల పాటు తమను వెంటాడినట్టు చెప్పుకొచ్చారు. మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్ రావును కూడా సిట్ అధికారులు పిలిచి విచారించారు. సాక్షిగా వాంగ్మూలం తీసుకున్నారు. ఈ ఉదయం 10.30కి ఆయన తన స్టేట్మెంట్ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలోనే ఫోన్ ట్యాపింగ్ కుట్ర జరిగిందని ఆరోపించారు. అధికారులు కీలకమైన వ్యక్తుల ఫోన్లు ట్యాప్ చేసి సమాచారాన్ని కేసీఆర్, సంతోష్కు చేర్చేవారని అన్నారు. ఇలా చేయడం వల్లే ఓటుకు నోటుఅంశం వెలుగు చూసిందని తెలిపారు. కవిత, పైలెట్ రోహిత్ రెడ్డి, రేగా కాంతారావు లాంటి వాళ్ల ఫోన్లు కూడా ట్యాప్ చేశారని విమర్శించారు. రాజకీయ నాయకులతోపాటు సినిమా, బిజినెస్ వాళ్ల ఫోన్లు కూడా ట్యాపప్ చేశారని ఆరోపించారు.

### నాయిని, కడియం శ్రీహరిపై

## కొండా సురేఖ తీవ్ర వ్యాఖ్యలు

ముఖ్యమంత్రి వద్దకు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వద్దకు వెళ్లి నాపై లేనిపోనివి చెబుతున్నారు” అంటూ సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. “నాకు అదృష్టం ఉంది కాబట్టి మంత్రి అయ్యాను. ఆయనకు అదృష్టం ఉన్నప్పుడు ఆయన కూడా మంత్రి అయ్యారు. అలాంటప్పుడు నన్ను మంత్రి పదవి నుంచి దిగిపోవాలని అనుకోవడం ఎంతవరకు సమంజసం? నా కుమార్తెకు అదృష్టం లేక ఎమ్మెల్యే కాలేదు. కడియం కుమార్తెకు అదృష్టం ఉంది కాబట్టి ఎంపీ అయ్యింది. అందుకోసం నేను ఆమె ఎంపీ పదవి తీసేయాలని అంటున్నానా?” అని మంత్రి సురేఖ ప్రశ్నించారు. గోదావరి పుష్కరాల నిర్వహణ విషయంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను సమాన దృష్టితో చూడాలని మంత్రి కొండా సురేఖ అన్నారు. పుష్కరాల కోసం కేంద్రం రూ. 200 కోట్లు కేటాయించాలని కోరుతూ లేఖ రాసినట్లు తెలిపారు. “ఆంధ్రప్రదేశ్తో పోలిస్తే తెలంగాణలోనే గోదావరి పుష్కరాలు అధికంగా జరుగుతాయి. భద్రాచలంలోని శ్రీరాముని పాదాల నుంచే గోదావరి ప్రవహిస్తుంది, ఇక్కడే పుష్కరాలు ఘనంగా నిర్వహిస్తాం” అని ఆమె పేర్కొన్నారు. తెలంగాణ పట్ల కేంద్రం వివక్ష చూపడం తగదని హితవు పలికారు. గోదావరి పుష్కరాల నిధుల విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలని, లేనిపక్షంలో వారు చేతకాని మంత్రులుగా చరిత్రలో నిలిచిపోతారని ఆమె వ్యాఖ్యానించారు.

## పోలవరంపై కవిత సంచలన వ్యాఖ్యలు

ఈ అంశాన్ని చర్చించాలన్నారు. ఐదు గ్రామాలను వెనక్కి తీసుకొచ్చేలా సీఎం రేవంత్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కవిత డిమాండ్ చేశారు. కరకట్టల ఎత్తు పెంచుకుంటేనే భవిష్యత్తులో కూడా ఐదు గ్రామాలకు రక్షణ ఉంటుందని అన్నారు. లేదంటే ఏ ఒక్క ఏడాదిలోనైనా భారీ వరదలు వస్తే అన్ని గ్రామాలు మునిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం వల్ల భద్రాచలం ప్రాంతానికి శాశ్వత ముంపు ఏర్పడిందని కామెంట్ చేశారు కవిత. ఏపీలో కలిపిన పురుషోత్తపట్నంలో భద్రాచలం రాములవారి భూములు వెయ్యి ఎకరాలు ఉందన్నారు. వెయ్యి ఎకరాల దేవుడి మాన్యం ఆంధ్రాకి పోయిందని, దేవుడేమో తెలంగాణలో ఉన్నాడని తెలిపారు. అక్కడ పట్టించుకునే పరిస్థితి లేక దేవుడి మాన్యం అన్యాక్రాంతమవుతోందని ఆరోపించారు. భద్రాచలం దేవుడి మాన్యాన్ని పరిరక్షించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని కవిత డిమాండ్ చేశారు. పోలవరం ముంపుపై సంయుక్త సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టును ఆపే ప్రయత్నంలో తెలంగాణ జాగృతి సుప్రీం కోర్టును ఆశ్రయించిందని గుర్తు చేశారు. 2014లో ప్రధాని మోదీ మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలో ఏడు మండలాలను ఏపీలో కలపడానికి ఆర్డినెన్స్ను అన్యాయంగా ఆమోదించారన్నారు. అంతే కాకుండా లోయర్ సిలేరు విద్యుత్తు ప్రాజెక్టును కూడా ఏపీ అప్పజెప్పారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసి చంద్రబాబు ఏడు మండలాలను, ఆ ప్రాజెక్టును లాక్కున్నారని అన్నారు. ఇది విభజన చట్టానికి, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని అప్పుడే పార్లమెంటులో తామంతా గళమెత్తామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యులందరం పార్లమెంటులో మాట్లాడామని కానీ కాంగ్రెస్ సభ్యులు మాత్రం ఏం పట్టనట్టు వ్యవహరించారని విమర్శించారు కవిత. కేసీఆర్ బంద్కు పిలుపునిచ్చినా కేంద్రానికి చీమకుట్టినట్టుగా కాలేదని మండిపడ్డారు. పోలవరం స్పిల్ వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచుకోవడం వల్ల తెలంగాణకు బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదంలో ఉందన్నారు.

### అక్టోబర్ 2లోపు రామాపురంలో

## చెత్త నిర్వహణ పూర్తి చేయండి

**తిరుపతి** రామాపురం డంపింగ్ యార్డ్ లో ఉన్న చెత్తను అక్టోబర్ 2 లోపు నిర్వహణ పూర్తి చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం రామాపురంలోని చెత్త డంపింగ్ యార్డు ను అధికారులతో కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డంపింగ్ యార్డులో ఉన్న చెత్త నిర్వహణ అక్టోబర్ 2లోపు పూర్తి చేయాలని అన్నారు. యంత్రాలు, కార్మికులను పెంచి త్వరగా చేయాలని అన్నారు. అలాగే పరిసర ప్రాంతాల్లో ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా మొత్తం నిర్వహణ చేయాలని అన్నారు. ప్రతిరోజూ ఎంత చెత్త నిర్వహణ చేస్తున్నారనే విషయాలను ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్,మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డి.ఈ.రమణ, జిగ్నా సంస్థ ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

# మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్

హైదరాబాద్ శనివారం 21, జూన్ 2025

## ఖాళీ సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్ష

**ఆదిలాబాద్ :** నార్నూర్ మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో సుమారు 10 వరకు ఖాళీ సీట్లు ఉన్నాయని ప్రిన్సిపాల్ ఎం. ప్రశాంత్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఖాళీల భర్తీ కోసం శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం 2 నుండి 3 గంటల వరకు జరిగే ప్రవేశ పరీక్షకు అర్హులైన విద్యార్థులు సకాలంలో హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

## నత్తనడకన వంట గదుల నిర్మాణాలు


**నిర్మల్ :** నిర్మల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వంట గదుల నిర్మాణం నత్తనడకన సాగుతుంది. నాలుగేళ్ల క్రితం వంట గదుల నిర్మాణం కోసం తగిన నిధులు మంజూరు చేసి పనులను ప్రారంభించారు. 410 మంది విద్యార్థులు చదువుకుంటున్న ఈ పాఠశాలలో వంట గదులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రధానోపాధ్యాయులు పరమేశ్వర తెలిపారు. వర్షాకాలంలో మధ్యాహ్న భోజన నిర్వహణ అష్టకష్టాల మధ్య సాగుతున్నదన్నారు. నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు.

## చుక్కల దుప్పిపై కుక్కల దాడి

**ఖానాపూర్ :** ఖానాపూర్ పట్టణంలోని డబుల్ బెడ్రూమ్ కాలనీ వద్ద శుక్రవారం ఓ చుక్కల దుప్పి వచ్చి కాలువ ప్రాంతంలోకి చేరింది. దుప్పిని గమనించిన కుక్కలు దాడి చేయగా గాయాలయ్యాయి. ఇది చూసిన స్థానికులు వెంటనే స్పందించి దుప్పిని కాపాడి స్థానిక వైద్యశాలకు తరలించారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా వారు వచ్చి దుప్పిని స్వాధీనపరుచుకున్నారు

### విద్యార్థులకు సకాలంలో

## సర్టిఫికెట్లు అందజేస్తున్నాం



**ముథోల్ :** జన్నారం మండలంలోని విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సర్టిఫికెట్లను సకాలంలో జారీ చేస్తున్నామని శుక్రవారం తహశీల్దార్ రాజ మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన టెన్త్, ఇంటర్ విద్యార్థులు వివిధ అడ్మిషన్ల కోసం కులం, ఆదాయం , నివాసం, తదితర ధ్రువీకరణల పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారన్నారు. వాటిని కార్యాలయ సిబ్బంది పరిశీలించి ధ్రువీకరించిన తర్వాత సర్టిఫికెట్లను వెంటనే జారీ చేస్తున్నామని వెల్లడించారు.

### పాఠశాల ప్రహరీ గోడ

## నిర్మాణానికి భూమి పూజ



**కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం నాగులపేట గ్రామంలో నాగులపేట మాజీ సర్పంచ్ కేతిరెడ్డి భాస్కర్ రెడ్డి తన స్వంత నిధులు 5 లక్షల రూపాయలతో నిర్మించబోయే ప్రహరీ గోడ, టాయిలెట్స్ నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా ప్రహరీ గోడ నిర్మాణానికి స్వచ్ఛందంగా నిధులు ఇచ్చిన మాజీ సర్పంచ్ కేతిరెడ్డి భాస్కర్ రెడ్డిని ఎమ్మెల్యే శాలువాతో ఘనంగా సన్మానించారు.

### నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన

## న్యాయవాదులు

**వేములవాడ :** హైదరాబాద్ లోని సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ మాజీ క్యాషియర్ పి. నారాయణను కొంతమంది వ్యక్తులు కిడ్నాప్ చేసి అమానుషంగా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కోర్టు ప్రధాన ద్వారం ముందు న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి కోర్టు విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

# సత్తుపల్లి డ్రైనేజీ సమస్యలను పరిశీలించిన దయానంద్

సత్తుపల్లి, జూన్ 20(ఎ.ఎం.ఎస్): సత్తుపల్లి పట్టణం-6 వార్డులో, డ్రైనేజీ సమస్యలను రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయ్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ సమస్య నెలకొని ఉందని, మురుగుకాల్వలు సరిగా లేకపోవడం వల్ల ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు, వర్షాల సమయంలో వరదనీరు రోడ్లపై పారుతూ తీవ్ర అపరిశుభ్రత నెలకొని ఉండేదని, దీంతో ప్రజలు ఇబ్బంది పడుతుండేవారని, ఇప్పుడు ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చేయనున్నామని తెలిపారు.



### స్థానిక సంస్థల ఎన్నికల

## సన్నాహక సమావేశం



**పాలకుర్తి, :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కొరకు బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ నాయకులు శుక్రవారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సన్నాహక సమావేశం గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా జిల్లా బిఆర్ఎస్ నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. రాబోయే స్థానిక సంస్థలలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు దిశగా అందరు కలిసి పనిచేయాలి అని పిలుపు ఇచ్చారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన

## పీసీసీ ప్రధాన కార్యదర్శి

**నర్సాపూర్ :** మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలోని ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో నర్సాపూర్ మండలం పలు గ్రామాల లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి మంజూరైన 6, 44, 500/- రూపాయల చెక్కులను అధికారులతో కలిసి పీసీసీ ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ హయంలో ఆరోగ్యశ్రీకి తూట్లు




**మహబూబ్‌నగర్ :** ప్రజా ఆరోగ్యం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో ఆ పథకానికి తూట్లు పొడిచారని ఆరోపించారు. సాయంత్రం మహబూబ్ నగర్ అర్బన్ మండలానికి చెందిన 78 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఆఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో ఆ పథకాన్ని పునరుద్ధరించడంతో పాటు రూ. 10 లక్షలకు పెంచామని వివరించారు.

### కోదాడలో ఘనంగా

## మంత్రి ఉత్తమ్ జన్మ దిన వేడుకలు

**కోదాడ :** కోదాడలో మంత్రి ఉత్తమ్ జన్మదిన వేడుకలు పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగ వీటి రామారావు, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ లక్ష్మీ నారాయణ రెడ్డి, మాజీ సర్పంచ్ ఎర్నేని బాబులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**పెద్దపల్లి:** ఓదెల మండలం కనగర్తి జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం దాస్ సేవా సమితి స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్ సీఈవో మల్క యశస్వి ఆధ్వర్యంలో రూ. 8 లక్షలతో పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రమేష్, అధ్యాపకులు, దాస్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

**కరీంనగర్:** జగిత్యాల పట్టణంలోని 41 వార్డులో 25 లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కప్పల శ్రీకాంత్, ఏవో శ్రీనివాస్, ఎఈ శరన్, మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

## పేదవారికి ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుంది

**పాలేరు:** పేదవాడికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దయానంద్ అన్నారు. శుక్రవారం వేంసూర్ మండలం కల్లూరు గూడెం గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేశారు. ఇచ్చిన హామీతో పాటు ఇవ్వని హామీలు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

## దోస్త్ అడ్మిషన్లకు గడువు పెంపు

**మధిర, :** మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ ద్వారా ప్రవేశాలకు అడ్మిషన్ల గడువు పెంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రారెడ్డి తెలిపారు. ఇప్పటికే దోస్తు ప్రక్రియ 2 దశలు పూర్తయినందున, మూడో దశ దరఖాస్తు ప్రక్రియను ఈనెల 25 వరకు పొడిగించడం జరిగిందని శుక్రవారం చెప్పారు. దోస్త్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు తమ కళాశాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

## లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్టాలు పంపిణీ

**ఖమ్మం:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లు పథకం కింద సత్తుపల్లి పట్టణంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మట్టా దయానంద్ లబ్ధిదారులకు మంజూరు పట్టాలు పంపిణీ చేశారు. ఇల్లు లేని ప్రతీ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో %సూవీజ% చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గాదె చెన్నారావు, మాజీ కౌన్సిలర్స్ ఉన్నారు.

## యోగాతో ఏకాగ్రత పెరుగుతుంది

**నర్సంపేట:** వరంగల్ జిల్లా నర్సంపేట ప్రభుత్వ మైనారిటీ పాఠశాలలో శుక్రవారం ఆయుష్ యోగా కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ శ్రీపాల నిర్వహించారు. యోగా చేయడం వల్ల మానసికంగా, ఆరోగ్యంగా ఉంటామని వారు అన్నారు. యోగా, నడకతో, మెడిటేషన్తో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరిగి చదువులో ముందుంటారని సూచించారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా పిల్లలతో పాటు పెద్దలు, మహిళలు యోగా చేయాలని కోరారు.

## వరంగల్ భద్రకాళి ఆలయం వద్ద జంతు బలి, మద్యం నిషేధం

**వరంగల్ ఈస్ట్ :** వరంగల్ భద్రకాళి అమ్మవారికి ఈ నెల 22న తొలిసారిగా బంగారు బోనం సమర్పించనున్నారు. ఈ సందర్భంగా ఎవరైనా అమ్మవారి ఆలయం వద్ద మద్యం తాగడం, జంతువులను బలి ఇవ్వకూడదని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని శుక్రవారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హెచ్చరించారు. ఇక్కడ బోనం సమర్పించడంపై మరోసారి ఆలోచించాలని మంత్రిని ఆయన కోరారు. భక్తుల మనోభావాలను దెబ్బతీయవద్దని విన్నవించారు.

## విప్లవ గీతాలతో దద్దరిల్లిన వెలిశాల

**భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు భారీగా చేరుకున్నారు. మావోయిస్టు గాజర్ల రవి అంత్యక్రియలలో పాల్గొనడానికి వచ్చిన వారు పాడిన విప్లవ గీతాలతో వెలిశాల దద్దరిల్లింది. పౌర సంఘాలు గజార్ల రవి మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రజా గాయకురాలు విమలక్క అంత్యక్రియలలో పాల్గొనడానికి వచ్చారు.

## అక్రమ కేసులు వెంటనే ఎత్తివేయాలని డిమాండ్

**మహబూబాబాద్:** నాడు ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని 50 రోజుల పాటు సమ్మె చేస్తున్న కాలంలో ఆర్టీసీ కార్మికులు, వామపక్ష ఉద్యమకారులపై పెట్టిన కేసులో భాగంగా మహబూబాబాద్ జిల్లా కోర్టుకు శుక్రవారం హాజరయ్యారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి విజయ సారథి, సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సిపిఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారథి రెడ్డి, పెరుగు కుమార్, సమ్మెట రాజమౌళి, ఆర్టీసీ కార్మికులు నాగయ్య రమాదేవి మహబూబాబాద్ జిల్లా కోర్టుకు హాజరయ్యారు.

### సీసీ రోడ్డు నిర్మాణానికి

## ఎమ్మెల్యే శంకుస్థాపన

**జనగామ:** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం జమస్థానపురంలో మంజూరైన రూ. 4 లక్షలతో నిర్మించబోయే సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు ప్రారంభమైన నేపథ్యంలో ప్రజల్లో ఆనందం నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీసీ రహదారి నిర్మాణంతో గ్రామ ప్రజలకు రాకపోకలు సౌకర్యవంతంగా మారతాయన్నారు.

### ఏడుపాయల దుర్గాభవానికి

## బిజెపి నాయకుల ప్రత్యేక పూజలు

**మెదక్ :** మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయల వన దుర్గ మాత అమ్మవారిని మెదక్ జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ దర్శించుకున్నారు. అనంతరం ఏడుపాయల దుర్గాభవానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు ఆయనను శాలువా, పూలదండతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

%Edited, Printed, Published and Owned by PURAM MAHESHWAR Printed at HARI HARA ART PRINTERS,H.No.6-185,Toopran,Dist.Medak, Telangana-502336. and Published at H.No. 4-50/18,Kallakal, Vill-Kallakal,(PO). Kadlakal,(M) Manoharabad, Dist.Medak-Telangana -502336. Editor: PURAM MAHESHWAR. RNI. No:TELTEL/2006/17154. Cell:800860999